మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

కూచనపల్లిలో టాస్క్‌ఫోర్స్ దాడులు

- 35 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాధీనం

హుస్నాబాద్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :

హుస్నాబాద్ మండలంలోని కూచనపల్లి గ్రామంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు హుస్నాబాద్ పోలీసులతో కలిసి ఆదివారం రోజున ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన 35 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి నిల్వ చేసినట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. దాడుల్లో భారీ మొత్తంలో పీడీఎస్ బియ్యం పట్టుబడగా, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ ఉంచడం, అక్రమంగా రవాణా చేయడం చట్టవిరుద్ధమని వారు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వ చేసినా, రవాణా చేసినట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ఇస్నాపూర్ పరిధిలో
4 నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు కృషి

పటాన్ చెరు,జూన్ 7,ప్రభాతవార్త :శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో ప్రజలకు లో వోల్టేజ్ సమస్య ఉత్పన్నం కాకుండా నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇస్నాపూర్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ఇస్నాపూర్ మున్సిపల్‌తో పాటు నాగులపల్లి, వెలిమెల, కొల్లూరు, భానూరు, నందిగామ, క్యాసారం పరిధిలో ఇటీవల పెద్ద ఎత్తున నూతన కాలనీలు ఏర్పాటు అవుతున్నాయని తెలిపారు. ఇందుకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. లో వోల్టేజ్ సమస్య ఉత్పన్నం కాకుండా పిటిఆర్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. నూతనంగా కర్ణనూర్, వెలిమల తాండ, నాగులపల్లి డబుల్ బెడ్ రూమ్ సముదాయం, పాశమైలారం పరిధిలో ఔట్ డోర్ సబ్స్టేషన్ల ఏర్పాటు కోసం త్వరలో రెవెన్యూ అధికారులతో చర్చించి స్థలాలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. ముత్తంగి పరిధిలో ఇండోర్ సబ్ స్టేషన్ కోసం సైతం స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కొల్లూరు పరిధిలో 130 కోట్ల రూపాయలతో 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటునకు ప్రభుత్వం పరిపాలన అనుమతులతో పాటు, స్థలం సైతం కేటాయించడం జరిగిందని పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే సూచించారు. లకడారం పరిధిలో నిర్మిస్తున్న నూతన సబ్ స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యే జీఎంఆర్ కు తెలిపారు. ఈ సమావేశంలో డిఈ నెహ్రూ నాయక్, ఏడిఈ తులసీ రామ్, తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మను దర్శించుకున్న సబ్ కలెక్టర్ దంపతులు

మనూర్, జూన్ 7, ప్రభాతవార్త: మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీ నల్లపోచమ్మ అమ్మవారిని ఆదివారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న సబ్ కలెక్టర్ దంపతులను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌స్వామి, సిద్దుస్వామి, నాగయ్య స్వామి, ప్రవీణ్‌స్వామిలు వేద మంత్రాలు వల్లిస్తుండగా సబ్ కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సబ్ కలెక్టర్ ఉమా హారతి దంపతులకు శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్య క్రమంలో ఆలయ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బోరంచ నల్లపోచమ్మ తల్లిని దర్శించుకుంటున్న సబ్ కలెక్టర్ ఉమా హారతి



భక్తులకు దర్శనమిస్తున్న వన దుర్గమ్మ

భక్తులతో కిట కిటలాడిన ఏడుపాయల

పాపన్నపేట, జూన్ , ప్రభాతవార్త :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయం ఆదివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగిస్తుండడం తో , ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఏడుపాయల క్షేత్రం భక్తుల నామస్మరణలతో మార్మోగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.వేకువజామునే వేద పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

అనంతరం పట్టు వస్త్రాలు వివిధ రంగుల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా మంజీరా నదిలోని మడుగులు, చెక్‌డ్యాం, పాయలల్లో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్ల లో బారులు తీరారు. భక్తుల రద్దీ కారణంగా ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఓడిబియ్యం, తలనీలాలు, బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, నాగరాజు శర్మ, మురళీ శర్మ, రాజశేఖర్ శర్మలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వీరేశం ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే క్షేత్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తన సిబ్బందితో కలిసి గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించి భక్తులకు సురక్షిత దర్శనం కల్పించారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే
కఠిన చర్యలు

నారాయణఖేడ్, జూన్ 7 ప్రభాతవార్త :

వానాకాలం పంటల సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి సాగు చేపట్టాలని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఉమా హారతి సూచించారు. రైతులు 60 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే విత్తనాలు విత్తుకోవాలని, తగినంత నేల తేమ లేకుండా పొడి దుక్కిలో విత్తనాలు విత్తరాదని ఆమె తెలిపారు. వానాకాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ప్రభుత్వ మరియు ప్రైవేట్ విక్రయ కేంద్రాల్లో తగినంతగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డి.ఏ.పీ. ఎరువుల విషయంలో రైతులు ఒకే కంపెనీ ఉత్పత్తిపై ఆధారపడవద్దని సూచిం చారు. పంటల ప్రారంభ దశలో డి.ఏ.పీ. ఒక్కటే వినియోగించకుండా, పంట అవసరాలను బట్టి కాంప్లెక్స్ ఎరువులను ప్రత్యామ్నాయంగా మొదటి దఫా ఎరువులుగా వినియోగించాలని వ్యవసాయ శాఖ సిఫార్సు చేస్తోందని తెలిపారు. డి.ఏ.పీ., యూరియా లేదా ఇతర ఎరువులను గరిష్ట చిల్లర ధర కంటే అధిక ధరలకు విక్రయించడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. ఎవరైనా అధిక ధరలకు విక్ర యించినట్లు ఫిర్యాదులు అందినా లేదా తనిఖీ ల్లో గుర్తించినా సంబంధిత డీలర్లపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం కఠిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.యూరియా ఎరువులను రైతులు యూరియా యాప్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకుని మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.అలాగే డి.ఏ.పీ. మరియు యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో డి.ఏ.పీ., నానో యూరియా ఎరువులను అన్ని పంటలలో వినియోగించి సమతుల్య పోషక నిర్వహణ పాటించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.రైతులు ఎరువుల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, ఎక్కడైనా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గమనిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సబ్ కలెక్టర్ కోరారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

కలుషిత నీటితోనే టిఫిన్లు, భోజనాలు..!

- హుస్నాబాద్‌లో ప్రజల ప్రాణాలతో చెలగాటం..!
- అధికారుల కళ్లు మూసుకుపోయాయా..? లేక
- హోటళ్ల యాజమాన్యాలపై ప్రత్యేక ప్రేమనా..?

హుస్నాబాద్ రూరల్, జూన్ 7, ప్రభాతవార్త :

హుస్నాబాద్ పట్టణంలో కొన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి వ్యాపారం సాగిస్తున్నా యనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. హోటళ్లపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల్లో ఫంగస్ (పాకురు), మురుగు, చెత్తపేరుకుపోయి ఉన్నప్పటికీ అదే నీటితో టిఫిన్లు, భోజనాలు తయారుచేసి ప్రజలకు వడ్డిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కలుషితమైన నీటినే వాటర్ ప్యూరిఫైయర్ల ద్వారా పంపించి తాగునీటిగా విని యోగదారులకు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలు డబ్బులు చెల్లించి ఆహారం తింటే అనారోగ్యాన్ని కొనుక్కో వాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని గణేష్ భవన్ హోటల్‌తో పాటు అనేక టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, మెస్‌లలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఏమి చేస్తున్నారనే ప్రశ్నలు వెలువెత్తుతున్నాయి.

ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితులు కనిపిస్తున్నా తనిఖీలు చేయకపోవడం వెనుక కారణాలేమిటని అధికారుల తీరును ప్రజలు నిలదీస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమిత మయ్యారా..? లేక ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకుండా చూస్తూ ఊరుకుంటున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలుషిత నీటితో తయారైన ఆహారం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురైతే బాధ్యత ఎవరు వహిస్తారని ఈ ప్రాంత మేధావులు ప్రశ్నిస్తున్నారు. ప్రజారోగ్యం ప్రమాదంలో పడే వరకు వేచి చూడ కుండా వెంటనే అన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నీటి ట్యాంకులు, వంటశాలల పరిస్థితిని పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిని చట్టం ముందు నిలబెట్టాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యం కంటే అధికారుల నిర్లక్ష్యమే ఎక్కువగా కనిపిస్తోందన్న విమర్శలు ఇప్పుడు హుస్నా బాద్‌లో గట్టిగా వినిపిస్తున్నాయి.

హుస్నాబాద్ పట్టణంలోని గణేష్ భవన్ ఉడిపి హోటల్‌పై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లో పేరుకు పోయిన చెత్త, ఫంగస్ (పాకురు) దృశ్యం

ఘనంగా బొడ్రాయి బోనాల ఉత్సవాలు

ఘట్‌కేసర్, జూన్ 7, ప్రభాతవార్త:

ఘట్‌కేసర్ నర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లో బొడ్రాయి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి ప్రతిష్టించి రెండేళ్లుగా కావడంతో ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహించారు. శనివారం ఉదయం బొడ్రాయికి పంచామృత అభిషేకం, పవిత్ర నీటితో అభిషేకం, బోనాలు చేసి బొడ్రాయి సమర్పించారు. ఆదివారం మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌లతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు విచ్చేసి బొడ్రాయి పూజలో పాల్గొని గ్రామదేవతలను దర్శించుకొని పూజలు చేశారు. ఈసందర్భంగా నిర్వహకులు శాలువాలతో వారిని సన్మానించారు. అవుషా పూర్‌లో నాయకులు పెద్దసంఖ్యలో బొడ్రాయి పండుగ ప్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామ దేవతల ఆలయాలను వివిధ రకాల పూలు, వేపాకులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను తయారు చేసి డప్పుశబ్దాల మధ్య బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవార్లకు నైవేధ్యం సమర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంఎ పిలు ఏనుగు సుదర్శణ్‌రెడ్డి, బండారి శ్రీనివాస గౌడ్, మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ డొంకెన బిక్షపతిగౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచులు ఏనుగు కావేరి మచ్చేందర్‌రెడ్డి, కందకట్ల విజయలక్ష్మారెడ్డి, వరిగంటి వెంకటేశ్‌గౌడ్, వంగూరి శివశంకర్, మాజీ ఎంపిటిసి ఏనుగు లక్ష్మారెడ్డి, కొట్టి గోపాల్‌రెడ్డి, నాగులపల్లి రమేశ, మంకం రవి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులఉ మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ ఉపసర్పంచులు ఎలసాని అయిలయ్యయాదవ్, బొడ్డు నాగార్జున్, గడ్డిఅన్నారం మార్కెట్ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బండారి అంజ నేయులుగౌడ్, ఆర్‌బిఎస్ జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, డిసిసి మాజీ కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ వార్డుసభ్యులు డొంకెన శంకర్‌గౌడ్, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, జంగయ్య, ఎరుకల దుర్గరాజు, వీరేశం, మల్లేశ్, వర్త్య పవన్‌నాయక్, నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి, పన్నాల ప్రతాపరెడ్డి, కానుగంటి శ్రీనివాస్, కవాడి మాధవరెడ్డి, కుక్కునూరి రాజేశేఖర్, కవాడి వామన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అబ్బోళ్ల నాగేశ్, పులకంటి రాజశేఖర్‌రెడ్డి, కందకట్ల సందీప్‌రెడ్డి, కుర్ర వేగానంద్‌గౌడ్, అల్లం శంకర్, డొంకెన మధు తదితరులు పాల్గొన్నారు.



దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వివరాలు వెల్లడించిన డి.ఎస్.పి.

జహీరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త : మద్యం చెడు అలవాట్లకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుండి మూడు తులాల బంగారం ,25 తులాల వెండి, బైకు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన డిఎస్పి బి సైదా నాయక్ ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ లో ఎస్సై లవ కుమార్ తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దొంగతనానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. పట్టణ ఎస్సై లవ కుమార్ తన సిబ్బందితో ఆదివారం ఉదయం 11 గంటలకు పట్టణంలోని భాగారెడ్డి విగ్రహం వద్ద వాహనాలను తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా ఆట్టి వ్యక్తిని పట్టుకొని విచారించగా అతను గుల్బర్గా జిల్లా చించోలి తాలూకా గరగపల్లి కి చెందిన అమ్రేష్ 22 గా తెలిపరన్నారు. తను తాగుడు మద్యం ఇతర అలవాట్లకు బానిసై డబ్బుల కొరకు పట్టణంలోని తాళం వేసిన ఇండ్లను తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నాడనీ తెలిపారు. ఈతని నుండి 3 .2 తులాల బంగారం బంగారం, 25 తులాల వెండి కొంత నగదు తో పాటు దొంగతనానికి ఉపయోగించిన పనిముట్లను స్వాధీనం చేసుకున్నారూ. ఈమేరకు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని తెలిపారు. దొంగను పట్టుకున్న ఎస్ఐ లవకుమార్ తోపాటు ఐడి పార్టీ సిబ్బందిని డీఎస్పీ సైదా నాయక్ ,సీఐ శివలింగం లు అభినందించారు.

మాజీ మంత్రులను కలిసిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం

జహీరాబాద్, జూన్ 7, ప్రభాతవార్త :

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆదివారం హైదరాబాదులో మాజీ మంత్రి తన్నీర హరీష్ రావు ,మాజీ మంత్రి మహమ్మద్ అలీలను మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా జైరాబాద్ నియోజకవర్గం సంబంధించిన విషయాలను మాజీ మంత్రితో చర్చించి నట్లు తెలిసింది.,ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గారు, భాస్కర్, కె.మల్లేష్ ఉన్నారు .

మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం

ఘనంగా కొట్యాల మల్లన్న తృతీయ వార్షికోత్సవం

మల్లన్న స్వామిని దర్శించుకుంటున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ములుగు, జూన్ 7 (ప్రభాతవార్త):

గొల్ల కేతలమ్మ, బలిజ మేడాలమ్మ సహిత మల్లన్నస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ నిర్మాత గంగిశెట్టి గణేష్‌గుప్తా, ఆయన కుమారులు శివకుమార్, చంద్రశేఖర్, ప్రవీణ్‌లు పూజారి డాక్టర్ శివశాస్తి పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మండపారాధన, గణపతి పూజలను ఘనంగా చేశారు. అనంతరం నవగ్రహ పూజ, పుణ్యాహవాచనం, కొట్యాల మల్లన్న అభిషేక కార్యక్రమాలను వేడుకగా నిర్వహించారు. తర్వాత కేతాలమ్మ, మేడాలమ్మ సహిత మల్లన్నస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. హోమం అనంతరం ఉమామహేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. అగ్నిగుండాల కార్యక్రమాన్ని చేపట్టారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. వార్షికోత్సవ వేడుకల్లో బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు, గజ్వేల్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ కొమురవెల్లి ప్రభాకర్‌గుప్తా, కేశవరం మాజీ సర్పంచ్ హేమారెడ్డి, అంతర్జాతీయ రోటరీ 3150 అసిస్టెంట్ గవర్నర్ జగదీశ్వర్, నాయకులు విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మల్లన్న దేవాలయం 3 లో

నర్సాపూర్ అడవి ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి దివ్య.

నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త :

నర్సాపూర్ అడవి ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహిత అడవిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి దివ్య అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా అటవీ శాఖ, నర్సాపూర్ అటవీ పరిధి ఆధ్వర్యంలో స్వాన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో అడవి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అడవి పరిశుభ్రత కార్యక్రమం ఆదివారం కు 6వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత నర్సాపూర్ లక్ష్యంగా ఈ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది. జిల్లా అటవీ శాఖ అధికారి జోజి మార్గదర్శకత్వంలో నర్సాపూర్ రేంజ్ అధికారి జి.దివ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎఫ్ఆర్ఓ దివ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో సుమారు 300 మందికి పైగా స్వచ్ఛంద కార్యకర్తలు, విద్యార్థులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. వీరంతా కలిసి అడవిలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారన్నారు. అంతేగాక ప్రకృతిని కాపాడుకోవాలని ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు శ్రీ సిద్ది రామ్ సింగ్, పృథ్వీరాజ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సాయిరామ్, మల్లేశం, ఓం ప్రకాష్, రాజమణి, శ్రీధర్, కలీముద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు నర్సాపూర్ అర్బన్ పార్క్ సిబ్బంది, బేస్ క్యాంప్ సిబ్బంది, మెదక్ జిల్లా రేంజ్ సిబ్బంది, మరియు స్వాన్ ఎన్జీఓ హైదరాబాద్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సాపూర్ అడవిలో నిర్వహించిన అడవి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న అటవీశాఖ అధికారులు ఎన్జీవో ప్రతినిధులు తదితరులు

ఆలయ చైర్మన్, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న దృశ్యం

లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయ చైర్మన్‌గా అరవింద్‌కుమార్‌గౌడ్

చాంద్రాయణగుట్ట, జూన్ 7, ప్రభాతవార్త : లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయం నూతన చైర్మన్‌గా జి.అరవింద్‌కుమార్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం లాల్‌దర్వాజా మగ్దుంపురాలోని శివపార్వతి ఫంక్షన్ హాలులో ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. దేవాలయ మాజీ చైర్మన్ జి.కాశీనాథ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అరవింద్‌కుమార్ గౌడ్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోసాని సతీష్ ముదిరాజ్, కోశాధికారిగా హరీష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాల ఉత్స వాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. త్వరలో మరో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో కమిటీని ప్రకటిస్తామని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు జె.లక్ష్మీనారాయణగౌడ్, కె.వెంకటేష్, బద్రినాథ్‌గౌడ్, సి.శివకుమార్‌యాదవ్, పోసాని సురేందర్‌ముదిరాజ్, కమిటీ సభ్యులు, బస్తీవాసులు పాల్గొన్నారు. కాగా మరో వర్గం దేవాలయంలో సమావేశమై మాజీ చైర్మన్ బి.మారుతీయాదవ్‌ను తిరిగి ఆలయ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు అతని మద్దతుదారులు ప్రకటించారు. ఆలయ నూతన కమిటీ ఎన్నిక నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరాశ్రయుల సంరక్షణకు కృషి : ఎమ్మెల్సీ

వైఎంసీఏలో వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దయాకర్

కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త: సమాజంలో అణిచివేతకుగురై నిరాశ్రయులుగా నిలువనీడ లేకుండా ఉన్నవారి అభాగ్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి సంరక్షణకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. వైఎంసీఏ 182వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎంసీఏ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైఎంసీఏ అధ్యక్షుడు జయాకర్ డేనియల్ మాట్లాడుతూ నిరాశ్రయులకు విద్యావంతులైన నిరుద్యోగులకు షెల్టర్ కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 8 (సోమవారం) నుంచి ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అద్దంకి దయాకర్ సతీమణి నాగమణి, ప్రధానకార్యదర్శి లేనార్డ్ మైరాన్ పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో సుచిత్ర అకాడమీ జోడీకి స్వర్ణం

బ్యాడ్మింటన్ టోర్నీలో బంగారు పతకాలు సాధించిన జోడి

పేట్‌బషీరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త : గచ్చిబౌలిలో నిర్వహించిన యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్15) జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీకి చెందిన కిమ్‌కిమ్ ఖోంగ్‌సాయ్,లియాన్‌సాంగ్‌పుయా జోడీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. నాలుగో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ జంట టోర్నీ మొత్తం అద్భుత ప్రదర్శన కనబరిచి జాతీయ ఛాంపియన్లుగా అవతరించింది. సెమీఫైనల్లో రెండో సీడ్ జోడీని ఉత్కంఠ భరిత పోరులో ఓడించిన కిమ్‌కిమ్‌లియాన్‌సాంగ్‌పుయా జంట, ఫైనల్లో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 21-10, 21-15 స్కోరుతో విజయం సాధించి టైటిల్‌ను సొంతం చేసుకుంది.

ప్రజలకు రక్షణగా సీసీ కెమెరాలు: ఏసిపి కృష్ణయ్య

సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణయ్య, ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జూన్ 7 ప్రభాతవార్త: రాత్రింబవళ్లు ప్రజలకు రక్షణగా, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నేత చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌కాలనీ సంక్షేమ సంఘం వారు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను, దాత చిలుక ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఏసీపీ కృష్ణయ్య, చైతన్యపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సైదులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు తోడ్పాటనందిస్తాయని, ప్రతీకాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని, ఇప్పటికే పలు కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు తగ్గాయన్నారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం చిలుక ఉపేందర్‌రెడ్డి, ఏసిపి కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ సైదులును శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్.రామ్‌గోపాల్, వ్యవస్థాపక సభ్యుడు పిఎస్.రామన్, ఉపాధ్యక్షుడు ఎన్ఎస్ఎన్.మూర్తి, కోశాధికారి కె.శ్రీనివాస్, ఎస్పై గోవర్ధన్, సాంకేతికరంగ పోలీసులు రాజారెడ్డి, రాకేష్, పీఏ. సుబ్బారావు, ఎన్.వేణుగోపాల్, వంశీకృష్ణ, సుజాతగౌడ్, టి.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, భీమలింగం, శేషాద్రి, డి.పుల్లారెడ్డి, వివి.సుబ్బారావు, బి.నారాయణరావు, జె.పాండరీనాథ్, రాజేష్, ఈబి.రమణ, రాఘవ, కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఘనస్వాగతం

కార్వాన్, జూన్ 7 (ప్రభాతవార్త) : పవిత్ర హజ్ యాత్ర ముగించుకొని షేక్ జాకీ, మహ్మద్ అలీముద్దీన్,మహమ్మద్ అబ్బాస్ హుస్సేన్, మహ్మద్ ఆజం,షేక్ హమేద్,అబ్దుల్ రెహమాన్,ఉస్మాన్ పటేల్,మహ్మద్ కలీముద్దీన్, మక్బూల్ భాయ్‌లు తిరిగి వచ్చిన తరువాత కార్వాన్ నియోజకవర్గం ఏఐఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో పాటు పార్టీ సభ్యులు,శ్రేయోభిలాషులు వారికి ఘనస్వాగతం పలికారు

భారతీయ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్

రవీంద్రభారతి, జూన్ 7 ప్రభాతవార్త : నేటి ఆధునిక సాంకేతిక సమాజంలో బంధాలు అనుబంధాలు దుస్థితి, చిన్న సాకుతో పెళ్లి, భార్యాభర్తల అనుబంధాలు మృగ్యమై విచ్ఛిన్నమౌతున్న పరిస్థితుల నుంచి భారతీయ కుటుంబ వ్యవస్థను, మానవత్వ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ పౌరుడిపైన ఉందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. ఉమ్మడి కుటుంబాలు ఆదర్శవంతమైతే అనురాగదంపతులు మరింత ఆదర్శమని, వీరికి పురస్కారం ఇవ్వడం సమాజానికి ఒక మంచి సందేశమని, తద్వారా కుటుంబానికి, రాష్ట్రానికి, దేశానికి భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేస్తూ నిర్వాహకులను, పురస్కార గ్రహీతలను అభినందించారు. పెళ్లంటే నూరేళ్లపంట అనేదాన్ని మరిచి నేడు ప్రపంచాన్ని మహమ్మారిగా కుదిపేస్తున్న పెద్దసమస్య దంపతుల అనుబంధం లోపించడమని, మానవత్వం,మానవ సంబంధాలు మాయమై అన్యోన్యం ఆదర్శం మైమరచిపోతున్నారని తెలంగాణ తొలి శాసనసభాపతి, మండలిలో ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఈవైపరీత్యం, దుస్థితి నుండి కుటుంబాలు బయటపడాలన్న గొప్ప సందేశాత్మకంగా మంచి మార్పు కోసం అనురాగ దంపతులను ఎంపికచేసి వారికి పురస్కారాలు అందిస్తున్న ఎ.మల్లికార్జునరావు, రాఘవ తదితర సభ్యులను అభినందించారు. నేడు చదువు సంపద విజ్ఞానం పెరిగినా జ్ఞానంలేక సంస్కారవంతులు కాలేకపోతున్నామని తేటతెల్లమౌతుందని వాపోయారు. మనుషుల మానసికస్థితి మారాలని, అందుకు శాస్త్రీయ పరిశోధన అవసరమని, ప్రభుత్వాలు బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. నేను, నాకు అనే అహం మనిషి నుండి పోతేనే సమాజం బాగుపడుతుందని స్పష్టం చేశారు.

మెగాసిటీ నవకళావేదిక, మదర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థల 29వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన అనురాగ దంపతుల పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనరావులు విశిష్ట అతిథులు డి.ఎల్.పాండు, రాపోలు భాస్కర్‌నేత, లయన్ డా. ఎ.వి.స్వామి, సుధీర్‌కుమార్, సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జున్ రావు, అరుణజ్యోతి దంపతులు, కార్యనిర్వాహక కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, ఆర్.సాయి కుమార్ తదితరులతో కలిసి 18మంది దంపతులకు అనురాగ దంపతుల పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో రాజీ పడేదిలేదు

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 7 ప్రభాతవార్త: ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదనీ ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నాయకురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలో కొత్తగా ఏర్పడిన జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని ప్రశాంతిహిల్స్, జిల్లెలగూడ డివిజన్లలో రూ.1.75 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు అదే విధంగా నాదర్‌గుల్ డివిజన్‌లోని శేషాద్రి నగర్‌లో రూ.87 లక్షలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణాలకు ఆదివారం ఆమె శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల సంక్షేమ సంఘాలు, స్థానికులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఆమె పర్యటించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు ప్రతిపక్ష నియోజకవర్గాల్లో అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆమె విమర్శించారు. ప్రజలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమానికి, ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని ఆమె పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కొత్త డివిజన్లలో ఏ ప్రాంతం కూడా ముంపునకు గురికాకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. డ్రైనేజీలు, నాలాల్లో పూడికలు తీసి వరద ప్రవాహం సాఫీగా సాగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపిటిసి సంరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, సిద్దాల లార్డ్స్ బీరప్ప, ఏనుగుల అనిల్ యాదవ్, సిద్దాల లావణ్య బీరప్ప, నాయకులు అర్కల కామేష్‌రెడ్డి, రామిడి తూఫాన్‌రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, మాదరి రమేష్, అబ్బనమోని గోపియాదవ్, సిద్దాల అంజయ్య, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, లలితా జగన్, పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, రామిడి నర్సిరెడ్డిలతో పాటు కాలనీలవాసులు, సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

భక్తపోతన పౌరాణిక నాటక ప్రదర్శనలో దృశ్యం

తన్మయుల్ని చేసిన భక్తపోతన్న పౌరాణిక నాటకం

రవీంద్రభారతి, జూన్ 7 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో రవీంద్రభారతిలోని పాల్కురికి సోమన్న(ఘంటసాల)కళామందిరంలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన జరుపుతున్న సాంస్కృతిక మహోత్స వంలో 67వ రోజు రాత్రి జనగామ నెల్లుట్ల ఫౌండేషన్‌వారిచే పిఎస్ఆర్.ఆంజనేయులు రచన, ఎంఎస్ఆర్‌కె దర్శకత్వంలో భక్తపోతన పౌరాణిక నాటకం ఆహుతులను ఆకట్టుకుంది. పోతనగా శూలపాని శ్రీరాముడు, గంగు నాగరాజ్‌శర్మ; సరస్వతిదేవిగా మాడ భూషణం, విధిత శరణ్య; ఆంజనేయస్వామిగా పన్నీరు రాజు; శ్రీసర్వజ్ఞ సింగ భూపాలుడుగా ఎస్.పుండరీకాక్షుడు; శ్రీనాథుడుగా వి.సూర్యప్రకాష్, నరస మాంబగా పి.సావిత్రి; మంత్రిగా రాజనర్సింహారెడ్డి; రాజనర్తకిగా సిరి తమతమ పాత్రల్లో అలరించగా సంగీతం నామచంద్రబాబునాయుడు, డోలక్ మీద శ్రీనివాస్ వాద్యసహకారం అందించి నాటకాన్ని రక్తికట్టించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏనుగు నరసింహారెడ్డి నటీనటులను సత్కరించారు. శ్రీనివాస్‌రాజు, విద్యానందచారిలు వ్యాఖ్యానం ఎంతగానో ఆకట్టుకుంది.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

నాంపల్లి, జూన్ 7 ప్రభాతవార్త :

నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ హైదరాబాద్‌లో అద్భుతంగా నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ఆదివారం విజయవంతంగా ముగిసింది. ఈనాటి ముగింపు కార్యక్రమంలో పిల్లలు సంగీత, నృత్యవిభాగాలలో చిన్నారుల ప్రదర్శనలు అంబరాన్నంటాయి. ముఖ్యంగా ఈ ప్రదర్శనల్లో అన్నమయ్య కీర్తనలు, భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుని రక్తికట్టించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జవహర్ బాలభవన్ సంచాలకురాలు ఎస్.విజయలక్ష్మి,బాలభవన్ సహాయ సంచాలకురాలు ఇందిర, కార్యాలయ సిబ్బంది నిర్వహణల్లో పాల్గొన్నారు.

గాయకుడు రామ్‌కుమార్‌కు వంశీ ఎస్పీ బాలు గ్లోబల్ అవార్డ్ ప్రదానం

చిక్కడపల్లి, జూన్ 7 (ప్రభాతవార్త) :

విఖ్యాత గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళారవిందం ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై ప్రత్యేక గీతాలాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్, భార్గవి నాగరాజ్ తదితర గాయనీ గాయకులు బాలు ఆలపించిన పలు అమర సినీ గీతాలను అద్భుతంగా గానం చేసి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం నిర్వహించిన సభా కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంగీత రంగంలో విశేష సాధన చేసిన రామ్‌కుమార్.. ఎస్పీ బాలు పాడిన వైవిధ్యమైన పాటలను అంతే మధురంగా పాడగల ప్రతిభాశాలి అని కొనియాడారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌కు ̎వంశీ ఎస్పీ బాలు గ్లోబల్ అవార్డ్‌తో పాటు ̎బహు కళానిధి బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.ప్రముఖ గాయకుడు త్రినాథరావు మాట్లాడుతూ.. కళారవిందం సంస్థను స్థాపించి రామ్‌కుమార్ వందో వినూత్న సంగీత కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కాగా, కళారవిందం సంస్థ పక్షాన ప్రముఖ గాయని భార్గవి నాగరాజ్‌కు ̎కళా స్వర కౌముద్ధి బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాంస్కృతిక విశ్లేషకుడు విశ్వనాథ్‌తో పాటు పలు సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు, ప్రముఖులు పాల్గొని రామ్‌కుమార్‌కు తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



రామ్‌కుమార్‌కు వంశీ ఎస్పీ బాలు గ్లోబల్ అవార్డ్ ప్రదానం చేసిన దృశ్యం

అందరి సహకారం వల్లే వ్యవసాయ వర్సిటీకి 24వ ర్యాంక్

16 మంది అసోసియేట్ డీన్, డైరెక్టర్‌లలో 8 మంది ఎస్సీ, ఎస్టీల నియామకం

వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి అల్దాస్ జానయ్య

అసోసియేట్ డిన్ ,డైరెక్టరల అభినందన సభలో ఉప కులపతి అల్దాస్ జానయ్య

అత్తాపూర్, జూన్ 7,ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంపరిధిలోని వివిధ వ్యవసాయ కళాశాలలకి అసోసియేట్ డీన్స్‌గా, పరిశోధనా స్థానాల అసోసియేట్ డైరెక్టర్లుగా నియమితులైన ఎస్సీ, ఎస్టీ ఫ్యాకల్టీ సభ్యుల అభినందన, సన్మానసభ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో శనివారం జరిగింది. మొత్తం 16మంది అసోసియేట్ డీన్స్, అసోసియేట్ డైరెక్టర్స్ ఆఫ్ రీసెర్చ్‌లో ఎనిమిది మంది ఎస్సీ, ఎస్టీలే నియమితులవడం వ్యవసాయ విశ్వ విద్యాలయంలో ఇదే తొలిసారి. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ సెల్, విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హాజరై రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన ఎస్సీ, ఎస్టీ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులని ఉద్దేశించి ప్రసంగించారు.తాను బాధ్యతలు చేపట్టి నేటికి 18 నెలల 18 రోజులు అయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ఫూర్తితోనే తాను విశ్వ విద్యాలయంలో అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రతిభ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడం అన్న అంశాల ఆధారంగా నియామకాలు చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదే విధంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనం వంటి వినూత్న కార్యక్రమాలతో రైతులతో నిత్యం మమేకం అవుతున్నామని వివరించారు. బోధన, బోధనేతర సిబ్బంది సమిష్టి కృషితోనే ఇన్ని కార్యక్రమాలు చేపట్టగలిగామని అభిప్రాయపడ్డారు. అందరి కృషి వల్లే గతంలో 37వ స్థానంలో ఉన్న విశ్వవిద్యాలయం గత ఏడాది 24వ ర్యాంక్ సాధించిందన్నారు. ఈ ఏడాది 20లోపు ర్యాంక్ సాధిస్తుందని, 2027 లో పదిలోపు ర్యాంక్‌ని విశ్వవిద్యాలయం సాధిస్తుందని అల్దాస్ జానయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్తగా నియమితులైనవారు ఈ అవకాశాలని, అధికారాల్ని నీతి, నిజాయితీ, నిబద్ధతలతో బాధ్యతలను నిర్వర్తించి విశ్వవిద్యాలయం ఖ్యాతిని మరింత పెంచాలని అల్దాస్ జానయ్య పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజ్యాంగ అసలు ప్రతిని అల్దాస్ జానయ్య విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఉప కులపతిని సన్మానించారు. అభినవ అంబేద్కర్‌గా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, రాజేంద్రనగర్ కళాశాల అసోసియేట్ డిన్ సి.నరేంద్రరెడ్డి, విశ్వవిద్యాలయ అధికారులు, ఎస్ సీ, ఎస్టీ సెల్ ఆఫీసర్ ఇన్‌చార్జి ఎం.రాజేశ్వరనాయక్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.ప్రవీణ్‌కుమార్, ఎస్ ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.బాలాజీనాయక్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో మెగా ఉచిత ఆరోగ్య శిబిరం

కుత్బుల్లాపూర్, జూన్ 7, ప్రభాతవార్త : గాంధీనగర్‌లోని టాగోర్ హై స్కూల్‌లో డా. ముద్దాపురం శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత ఆరోగ్య శిబిరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లవి హాస్పిటల్స్, పిఆర్ఓ డెంటల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొలను హనుమంత్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం సామాజిక బాధ్యతలో భాగమని, ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలన్నారు. శిబిరంలో సాధారణ ఆరోగ్య, దంత, మహిళల ఆరోగ్య పరీక్షలు, చిన్నారుల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా. ఎం. చంద్రశేఖర్, డా. ఎం. ప్రదీప్‌రెడ్డి, డా. బి.కళ్యాణి వైద్యసేవలు అందించి శిబిరం విజయవంతానికి సహకరించారు. అలాగే మేకల ఎల్లయ్య, ఎం.డి.ఖాజా, ఎం.ప్రదీప్‌కుమార్, మొయిన్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు స్వచ్ఛంద సేవకులుగా సేవలందించారు.

మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీని పరామర్శించిన ఎమ్మెల్యే

జీడిమెట్ల, జూన్ 7, ప్రభాతవార్త : అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం పరామర్శించారు. కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవ్‌జీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యం, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా దేవ్‌జీతో కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడిన సత్యం, ఆయన యోగక్షేమాలను విచారించారు. అరగంటకు పైగా జరిగిన భేటీలో దేవ్‌జీ తన విప్లవ ఉద్యమ అనుభవాలను ఎమ్మెల్యే సత్యంతో పంచుకున్నారు. సత్యంను చూసి దేవ్‌జీ ఆత్మీయంగా పలకరించినట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన లాసెట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించిన దేవ్‌జీని ఎమ్మెల్యే సత్యం ప్రత్యేకంగా అభినందించారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవ్‌జీ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే సత్యం, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్

చార్మినార్, జూన్ 7 ప్రభాతవార్త : చేప ప్రసాదం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. పాతబస్తీ దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలో చేప ప్రసాదం తయారు చేయటానికి ముందు ఆనవాయితిగా నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో మెట్టు సాయి కుమార్.టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సతీమణి సంధ్యారాణితో పాటు బత్తిని గౌడ్ కుటుంబ సభ్యులు, బంధువులు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంఛార్జి కె.వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని,దేశంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవటానికి అందరూ ముందుకు రావాలి

తెలంగాణ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి

చార్మినార్, జూన్ 7 ప్రభాతవార్త : సమాజంలోని పేదలను ఆదుకోవటానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని తెలంగాణ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి అన్నారు.తెలంగాణ బసవ కేంద్రం ఆధ్వర్యంలో చేప ప్రసాదం కోసం వచ్చే అస్తమా రోగులు కోసం భోజనాలు,అల్పాహారం ఏర్పాటు చేశారు.దేశంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ప్రజలకు భోజనం,టీతో పాటు అల్పాహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి తెలంగాణ బసవ కేంద్రం పలు సామాజికి కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గోవింద రాఠీ, తెలంగాణ బసవ కేంద్రం ప్రతినిధులు మల్లిఖార్జున్, దినేష్ పట్నే, అశోక్ మాశెట్టి, రమేష్ సోలాపూర్, రాజేష్, శివతో పాటు పలువురు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తాం

కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు గోకరణ్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోషామహల్, జూన్ 7 ప్రభాతవార్త : గోషామహల్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని బతోపేతం చేసి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని నూతనంగా గోషామహల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గోరణ్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించేందకుగాను కృషి చేస్తానన్నారు. డివిజన్ అధ్యక్షులుగా నియమించిన గోరకరణ్‌సింగ్‌ను శాలువ కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడూతూ బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

చిట్ ఫండ్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, జూన్ 7 (ప్రభాతవార్త) :

ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్టీలు వేయించుకొని నెల నెల చిట్టి పాట పెట్టకుండా చిట్టి సభ్యులను మోసం చేస్తూ ప్రభుత్వ నిబంధన లను తుంగలో తొక్కి ప్రభుత్వానికి విరుద్ధంగా మోసం చేస్తున్న చిట్ ఫండ్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ చిట్ ఫండ్ బాధితుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గారె వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బాగ్ లింగంపల్లి లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో కొన్ని చిట్ ఫండ్ సంస్థలు వేలమంది అమాయక ప్రజలను చిట్టి సభ్యులుగా చేర్చుకొని కోట్ల రూపాయలను నెలనెలా వసూలు చేస్తూ చిట్టి యాక్షన్ పాట పెట్టకుండా వాళ్లకు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. చిట్టి సభ్యులు చిట్టి పాట పెట్టమని అడిగితే మా ఇష్టం నీకు డబ్బులు కావాలంటే ఐదు శాతం కంపెనీ కమిషన్ తీసుకొని చిట్టి డబ్బులు ఇస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. నార్త్ ఈస్ట్ చిట్ ఫండ్ ఒక్క గ్రూపుకు(ఎఫ్ డిఆర్) అనుమతులు తీసుకొని ఒకే బ్రాంచ్ పేరుతో 15 గ్రూపులను నడుపుతూ ప్రభుత్వాన్ని,చిట్టి సభ్యులు మోసం చేస్తుందని ఆరోపించారు. అమాయక ప్రజలను మోసం చేస్తున్న చిట్ ఫండ్ కంపెనీని సిజ్ చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి చిట్టి సభ్యులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చిట్టిలు వేసి నష్టపోయిన బాధితులకు వడ్డీతో సహా ఇప్పించే చే వరకు పోరాటం హెచ్చరించారు.

మహిళలకు చీరెలు పంపిణీ

కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త: మహిళా సాధికారతకు సిఎం రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళలు కోటీశ్వరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. ఆదివారం 8వ వార్డు బొల్లారం రిసాల బజార్‌లో నిర్వహించిన మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు వ్యాపార వేత్తలుగా,పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు చింతల వేణుగోపాల్ రెడ్డి,ప్రకాశ్, బాల్‌రాజ్, ఖదీర్ వన్,రామన్న తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో...

కంటోన్మెంట్, జూన్ 7 ప్రభాతవార్త: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆదేశాల మేరకు ఆదివారం 1వ వార్డులోని బోయిన్‌పల్లి, కడక్‌పు, నేతాజీ నగర్ ప్రాంతాల్లో జంపన ప్రతాప్ చేతుల మీదుగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ నేత కార్మికుల ద్వారా చీరలు తయారు చేయించి వారికి ఉపాధి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చోటు,మౌలా, సాయిబాబా యాదవ్, ముఖేష్ యాదవ్, కరన్ సింగ్, శశి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దమ్మ ఆలయంలో ఘనంగా అన్నదానం

హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, జూన్ 7, ప్రభాతవార్త: అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామంలోని పెద్దమ్మ దేవాలయం మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేకకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గంటల రాజవ్వ–రాజయ్య దంపతులు పెద్దమ్మ దేవాలయం వద్ద గ్రామస్తులు, భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు గంటల రాజవ్వ–రాజయ్య దంపతులను శాలువాతో సన్మానించి వారి సేవాభావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ఆలయఅభివృద్ధికి గ్రామస్తులు అందరూ సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాధరి రాజయ్య, కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వాసర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రం

సిర్గాపూర్, జూన్ 7, ప్రభాతవార్త: మండల పరిధిలోని వాసర్ గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జొన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ ప్రతాప్‌రెడ్డి రైతులకు సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సిఓ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ హనుమంతరావు, శివాజీ పాటిల్, ఉప సర్పంచ్ విఠల్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ ఏశప్ప, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పండరిరెడ్డి, దివాకర్, రాందాస్, బాబురావు, రైతులు పాల్గొన్నారు.

హత్నూరలో ముదురుతున్న నల్ల మట్టి వివాదం

హత్నూర జూన్ 7, ప్రభాతవార్త :

మండల కేంద్రమైన హత్నూరలో అల్వా చెరువు నల్ల మట్టి తవ్వకాల వివాదం హాట్ టాపిక్‌గా మారింది. మట్టి తవ్వకాలు నిర్వహించవద్దని కొందరు గ్రామస్తులు, రైతులు పట్టుబడుతుండటం, మరో వైపు పాలక వర్గంలోని కొందరు మట్టి తరలింపు ఎలాగైనా చేపట్టాలని పట్టు బడుతుండటంతో,అల్వచెరువు మట్టి తవ్వకాలు స్థానికంగా చర్చనీయాంశమైంది, మట్టి తరలింపులో పాటించాల్సిన నిబంధనలు పాటించకుండా అక్రమ పద్ధతిలో పత్రాలు, తీర్మానాలు సృష్టించి గ్రామ ప్రజలను పక్కదారి పట్టించారని గ్రామస్తులు కొందరు ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు, మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు చేశారు. మానవ హక్కుల సంఘం కూడా దీనిపై విచారణ జరపాలని జిల్లా అధికారులకు ఇదివరకే ఆదేశాలు ఇచ్చింది. కోట్ల రూపాయల విలువైన నల్లమట్టిని, నామమాత్రపు ధరలకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు కొందరు స్థానిక నాయకులు పాల్పడ్డారంటూ సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. తప్పుడు తీర్మానాలు సృష్టించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు గ్రామస్తులు చేసిన ఫిర్యాదులను పురస్కరించుకొని త్వరలోనే హత్నూరలో సంబంధిత అధికారులు విచారణ జరుపనున్నారని సమాచారం.

జిల్లా ఎంఇడబ్ల్యుఎ నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట రూరల్, జూన్ 7,ప్రభాతవార్త :

జిల్లా ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఎంఈడబ్ల్యుఎ) 2026–27 నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సయ్యద్ షౌకత్ అలీ, అధ్యక్షులుగా ఎం.డి.ఫక్రుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎం.డి.గౌస్, సయ్యద్ సంధాని, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి. ఉస్మాన్, కార్యదర్శులుగా ఎం.డి.మిస్‌బావుద్దీన్,కె.ఎం. ఆలం, కోశాధికారిగా ఎం.డి. అజీజ్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.డి.నసీరుద్దీన్, ఎస్.డి.ముజీబ్ అలీ, ఎం.డి.సాదక్ పాష,ఎం.డి. షాజీత్,ఎం.డి.అన్వర్,ఎస్.కె. బషీర్, ఎం.డి.చోటేమియా,ఎం.ఎ రషీద్‌లను ఎన్నుకున్నారు, ఎన్నికల అధికారులుగా ఎం.డి.షాజీద్, కె.ఎ.బాసిత్‌లు వ్యవహరించారు.

లలితావాణికి ప్రతిభా పురస్కారం

గజ్వేల్ టౌన్, జూన్ 7 (ప్రభాతవార్త):

గజ్వేల్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేందర్ కూతురు లలితావాణి పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పురస్కారం అందుకుంది. ఆదివారం సిద్దిపేట పట్టణ కేంద్రంలో సిద్దిపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా గజ్వేల్‌కు చెందిన విద్యార్థిని లలితావాణి ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కైలాసం విద్యార్థిని లలితావాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి ఫౌండేషన్ చైర్మన్ కొమురవెల్లి శివకుమార్, ప్రధాన వక్త డాక్టర్ వీరేందర్, శ్యాంసుందర్, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, చందా నాగభూషణం, శోభారాణి, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయపోల్, జూన్ 7 (ప్రభాతవార్త): మెదక్ ఎంపి రఘునందన్‌రావు చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.1,26,500 విలువైన చెక్కులను రాయపోల్ మండల బిజెపి అధ్యక్షుడు మంకిడి స్వామి ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. టెంకంపేట గ్రామానికి చెందిన బొమ్మ నర్సయ్య, ముంగిస్‌పల్లి గ్రామానికి చెందిన మన్నె దుర్గయ్య, బేగంపేట్ గ్రామానికి చెందిన యెంగారి లక్ష్మి, మంతూర్ గ్రామానికి చెందిన దరిపల్లి రాజుకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంకిడి స్వామి మాట్లాడుతూ ఎంపి రఘునందన్‌రావు ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, అవసరమైన సహాయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ నిధులు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

మొగుడంపల్లి,జూన్7,ప్రభాతవార్త:

మొగుడంపల్లి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 200203 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 24 ఏళ్ల తర్వాత వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకేచోట చేరి తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పాత మిత్రులను కలుసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

సైబర్ నేరాల్లో బ్యాంక్ ఖాతాల ఫ్రీజింగ్

-న్యాయం కోసం అగచాట్లు పడుతున్న అమాయకులు
-సమస్య నివారణకు హైకోర్టు న్యాయవాది అనిల్ దొరశెట్టి సూచన

న్యాల్‌కల్, ప్రభాతవార్త, జూన్ 7, ప్రభాతవార్త: డిజిటల్ యుగంలో బ్యాంకింగ్ సేవలు ప్రజా జీవితాల్లో అంతర్భాగమయ్యాయి. యూపిఐ చెల్లింపులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు రోజువారి ఆర్థిక లావాదేవీలను సులభతరం చేశాయని చెప్పడం అతిశయోక్తి కాదు. ఆర్థిక లావాదేవీల సౌలభ్యం వెనుక ఆందోళనకర వాస్తవం ఒకటి దాగి ఉంది. సైబర్ మోసాలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి ఉన్న బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయడం సాధారణ ప్రక్రియగా మారింది. బాధితుల డబ్బును రక్షించడం, నేరస్థులను గుర్తించడం ఎంత అవసరమో అదే స్థాయిలో అమాయక పౌరుల హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని చెప్పవచ్చు. ప్రస్తుతం అమలులో ఉన్న విధానాల కారణంగా అనేక మంది నిర్దోషులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సైబర్ క్రైమ్ నిపుణులు, హైకోర్టు న్యాయవాది దొరశెట్టి అనిల్‌కుమార్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండల కేంద్రమైన న్యాల్‌కల్‌కు వచ్చిన సందర్భంగా ప్రభాతవార్తతో అనిల్‌కుమార్ దొరశెట్టి మాట్లాడుతూ...

-తప్పు మోసగాడిది-శిక్ష అమాయకుడికి?

ఓ సబైర్ మోసగాడు బాధితుడి నుంచి లక్ష రూపాయలు మోసం చేసి ఆ డబ్బుతో ఓ వ్యాపారుడి వద్ద సరుకులు కొనుగోలు చేస్తే వ్యాపారుడికి సైబర్ నేరంతో సంబంధం లేకపోయినా సైబర్ నేరానికి గురైన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే మోసపూరిత డబ్బు వ్యాపా రుడి బ్యాంక్ ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించి సదరు వ్యాపారి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయడంతో అమాయ కుడైన వ్యాపారి అవస్థలు పాలుకాక తప్పడం లేదన్నారు.

-ఫ్రీజింగ్‌తో ఆర్థిక జీవితం స్థంభనం...

వ్యాపారి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయడంతో ఉద్యోగులకు జీతాలు చెల్లించుకోలేకపోవడం, సరఫరాదారులకు బకాయిలు చెల్లించుకునే అవకాశం లేకపోవడం, కుటుంబ అవసరాలను తీర్చుకునే అవకాశాలు లేక ఓ వైపు అవస్థలు పడుతుంటే మరో వైపు బ్యాంక్ ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయించుకునేందుకు సంబంధిత రాష్ట్రాలలోని సైబర్ పోలీసులను సంప్రదించి న్యాయవాదులను నియమించుకోవాల్సి వస్తుంది. కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగాడుతూ తమ తప్పు లేకపోయినా వివాదాస్పద మొత్తాన్ని తిరిగి చెల్లించడం ద్వారా ఉపశమనం పొందాల్సి వస్తోంది.

-ఒకే లావాదేవి-అనేక ఫిర్యాదులు...

ఒకే బ్యాంక్ లావాదేవీకి సంబంధించి భారత దేశంలోని వేర్వేరు రాష్ట్రాల్లో అనేక సైబర్ ఫిర్యాదులు నమోదయితే లావాదేవీ తేదీ, బదిలీ అయిన నగదు, వివాదాస్పద మొత్తం, యుటిఆర్ నంబర్ సైతం ఒకటే అయినా ప్రతి ఫిర్యాదును వేర్వేరు రుసుంగా పరిగణిస్తూ ఒక ఫిర్యాదులో మొత్తం తిరిగి చెల్లించి ఎన్‌ఓసి పొందినా, మిగిలిన రాష్ట్రాల్లోని పోలీసు అధికారులను మరో మారు సంప్రదిస్తూ ఆడిందే ఆటగా పాడిందే పాటగా మళ్లీ మళ్లీ ఎదుర్కోవాల్సి రావడం న్యాయ సూత్రాలకు విరుద్ధమని న్యాయపుస్తకాలు బోధిస్తున్నాయి.

-ఒకే సమస్యకు ఒకే పరిష్కారం ఉండాలి...

సైబర్ నేరాలకు రాష్ట్ర సరిహద్దులు ఉండనట్లుగా పరిష్కార వ్యవస్థ సైతం జాతీయ స్థాయిలో ఉండాల్సిన అవసరం ఉంది. ఒకే లావాదేవీకి సంబంధించిన అన్ని ఫిర్యాదులను అనుసంధానం చేస్తూ కేంద్ర వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఒకసారి డబ్బు తిరిగి చెల్లిస్తే, వివాదం పరిష్కారమైతే సదరు సమాచారం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని సంబంధిత అధికారులకు అందుబాటులోకి వస్తే అమాయక ఖాతాదారులు ఒకే విషయానికి పలుమార్లు వివరణలు ఇచ్చుకోవాల్సి అవసరం ఉండదు.

-ఎన్‌సిసిఆర్‌పి పోర్టల్‌లో పారదర్శకత అవసరం...

ఎన్‌సిసిఆర్‌పి పోర్టల్‌లో పారదర్శకత అవసరం. ఖాతా అన్‌ఫ్రీజ్ అయినా డబ్బు తిరిగి చెల్లించినా ఎన్‌ఓసి జారీ అయినా ఫిర్యాదు వివరాలు చాలా మేరకు యధాతథంగా కనిపిస్తున్నాయి. ట్రాఫిక్ చలాన్ల వ్యవస్థలో జరిమానా చెల్లించిన వెంటనే పెయిడ్ అయినట్లు కనిపించి నట్లే సైబర్ ఫిర్యాదుల విషయంలోనూ రిసాల్వ్‌డ్, క్లోస్డ్, నో ఫర్‌దర్ ఆక్షన్ పెండింగ్ లాంటి స్పష్టమైన స్థితి కానరావాల్సిన అవసరం ఉంది. ఒకే లావాదేవీపై బహుళ బాధ్యతలను నివారించాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైమ్ నిపుణులు, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయవాది దొరశెట్టి అనిల్‌కుమార్ సూచిస్తున్నారు. అమాయకులకు న్యాయం చేకూరేందుకు ఖాతాల అన్‌ఫ్రీజింగ్ ప్రక్రీయను వేగవంతం చేయాలని అనిల్‌కుమార్ సూచించారు. ఎన్‌సిసిఆర్‌పి రికార్డులను సమయానుకూలంగా నవీ కరించాలన్నారు. అమాయక ఖాతాదారులకు సమం స్థవంతమైన పరిహార వ్యవస్థ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా ఏకరీతి విధానాన్ని అమలు చేయాలన్నారు. సైబర్ నేరాలపై కఠినంగా వ్యవహ రించాల్సిన అవసరం ఉందని, న్యాయబద్ధంగా, పార దర్శకంగా, సమతుల్యంగా కూడా ఉండాలని, అమా యకులకు అన్యాయం జరుగకుండా అవసరం ప్రభుత్వంపై ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

భక్తులతో కిటకిటలాడిన మల్లన్న దేవాలయం

స్వామి వారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

కొమురవెల్లి, జూన్ 7,ప్రభాతవార్త : మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. భారీగా తరలివచ్చిన భక్తులతో మల్లన్న ఆలయ పరిసరాలు కిటకిటలడాయి. ఆలయ మాడ వీధులు,క్యూలైన్‌లు,ప్రసాద కౌంటర్ సెంటర్లు అర్ధ మండపం గంగ రేణు చెట్టు,మండపాల వద్ద భక్తుల సందడి నెలకొంది. స్వామి వారి దర్శనానికి నాలుగు గంటలు,ప్రత్యేక దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. వేసవి సెలవుల ముగిస్తుండడంతో ఆలయానికి రికార్డు స్థాయిలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని బోనాలు సమర్పించి మొక్కు లు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ తగు ఏర్పాట్లు చేశారు.

కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన డిఆర్‌ఎం

కొమురవెల్లి, జూన్ 7,ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే హైదారాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్(డిఆర్‌ఎం) సంతోష్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. స్టేషన్‌లో ప్రయాణీకులకు అందుతున్న సౌకర్యాలు,మౌలిక వసతులు,అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు, స్వామి వారి చిత్ర పటం అందజేశారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై డిఆర్‌ఎం అధికారులతో చర్చించారు.

స్వామి వారి చిత్ర పటాన్ని అందజేస్తున్న దృశ్యం

మాయికోడ్‌లో యజ్ఞహోమాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

గ్రామ సుభిక్షానికి మాయికోడ్‌లో యజ్ఞహోమాలు

మనూర్, జూన్ 7, ప్రభాతవార్త: గ్రామం సుభిక్షంగా ఉండాలంటూ మండలంలోని మాయికోడ్ గ్రామస్థులు ఆదివారం యజ్ఞహోమాలు నిర్వహించారు.

ప్రతి మాసం మొదటి ఆదివారం గ్రామానికి చెందిన పుణ్యదంపతులు వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో యజ్ఞహోమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామానికి చెందిన కొత్త నాందేవ్‌రావు కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు చేరుకున్న భక్తులకు ప్రసాద వితరణ (అన్నదానం) చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యంతోపాటు శారీరక దృఢత్వం

సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

వరల్డ్ సైకిల్‌డే పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో జిల్లా క్రీడా యువజనశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డివైఎస్ఓ వీరారెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు,కేలో ఇండియా సైక్లింగ్ కోచ్ సంజీవ్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా డివైఎస్ఓ వీరా రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సూచన మేరకు ర్యాలీ నిర్వహించడం జరిగిం దన్నారు. సైక్లింగ్‌తో ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం చేకూరుతుం దన్నారు.పర్యావరణహిత సైక్లింగ్ సాధన ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. విద్యార్థులు సైతం సైక్లింగ్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కేలో ఇండియా సైక్లిస్టులు 50 మంది పాల్గొన్నారు.

14న లంద నవల ఆవిష్కరణ

సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:

జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత పొన్నాల బాలయ్య రచించిన 'లంద' నవల ఆవిష్కరణ ఈనెల 14న హైదారాబాద్‌లోని రవీంద్రభారతి మినీ హాల్‌లో ఆవిష్కరించడం జరుగుతుందని మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు కె.రంగాచార్య, టిపిటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, నవల రచయిత పొన్నాల బాలయ్య, మరసం ఉపాధ్యక్షులు అలాజ్‌పూర్ శ్రీనివాస్, నందిని భగవాన్‌రెడ్డి, కవి, రచయిత రాజిరెడ్డిలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు.

కార్యక్రమానికి ప్రఖ్యాత కవి,రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నందిని సిద్దారెడ్డి. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ప్రముఖ కవి, రచయిత ప్రొ॥ కాశీం తదితరులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో మాదిగ సామాజిక వర్గాల జీవితం ప్రధాన అంశంగా పొన్నాల బాలయ్య 'లంద' నవల రచించారని తెలిపారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో లంద నవల తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుందన్నారు. నవల ఆవిష్కరణ సభకు జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి గంభీర్రావుపేట యాదిగిరి, మాదిగ దండోరా ప్రతినిధులు పెద్దమాతరి బాబు, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో మ్యాచ్ ఫిక్సింగ్ లేని రాజకీయాలు రావాలి

సంగారెడ్డి బ్యూరో జూన్ 7, ప్రభాతవార్త :

రాబోయే శాసనసభ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్‌ఎస్) అధికారంలోకి రావడం ఖాయం అని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

తెలంగాణ ప్రాంతాన్ని ప్రేమించే కొత్త రాజకీయ శక్తి గెలవాల్సిన అవసరం ఉందిని అన్నారు.సంగారెడ్డిలో మొత్తం మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలే జరుగుతున్నాయని కాంగ్రెస్ బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల నాయకులు మీద విమర్శించుకున్నప్పటికీ, లోపల అంతా ఒకటేనని, ప్రజల సమస్యలపై పోరాడకుండా రాజకీయ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. బుల్లెట్ ట్రైన్ ఇస్తామని ఇవ్వకపోతే ఎంపీ రఘునందన్ రావు నోరు ఎందుకు మెదపరని కవిత ప్రశ్నించారు. బీజేపీని ప్రశ్నించాల్సిన మిగతా పార్టీలు సైలెంట్‌గా ఉంటున్నాయని విమర్శించారు.

యువత మన చరిత్రను తెలుసుకోవాలి. చరిత్ర తెలిసిన వాళ్లే భవిష్యత్‌ను నిర్మిస్తారని గుర్తు చేశారు . ఈ ప్రాంతంలో టీఆర్‌ఎస్ జెండా ఎగురవేయటాన్ని గర్వంగా భావిస్తున్నానని,మన హక్కులు, ఉద్యోగాలు, వనరుల కోసం మనం బిడికిలి బిగించి కొట్లాడాలని పిలుపునిచ్చారు.

ఇవ్వాళ తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు ఉన్నాయి. కొత్త పార్టీ అవసరం ఏంటనీ అడుగుతున్నారు?

మూడు ప్రధాన పార్టీలు ఉన్న సరే పేద ప్రజలు చదువుకునేందుకు ఇబ్బంది పడే పరిస్థితులు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు.తెలంగాణ ఆడబిడ్డల మీద నమ్మకంతో పార్టీ పెట్టాను. కచ్చితంగా మేము మార్పు తీసుకొస్తామని అన్నారు.

రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా టీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అధికారంలోకి వచ్చాక ఉచిత విద్య, ఉచిత వైద్యం ఇవ్వకపోతే తెల్లాపూర్ శాసనానికి కట్టేసి రాళ్లతో కొట్టలన్నారు.సింగూరు ప్రాజెక్ట్ 15 ఏళ్లుగా కుంగుతూనే ఉంది. ఇరిగేషన్ శాఖ మంత్రిగా హరీష్‌రావు ఉన్నప్పటికీ ఒక్కరూపాయి ఇవ్వలేదని విమర్శించారు.ఆంధ్రావాళ్ల నిధులు ఇవ్వలేదంటూ వాళ్లను తిట్టాం. కానీ ఇప్పుడు ఎందుకు మనం బాగు చేసుకోలేదన్నారు. సంగారెడ్డిలో అన్ని పార్టీలకు చెందిన పెద్ద నాయ కులు ఉన్నారని,కానీ అందరూ కూడా మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేసే వారేనన్నారు. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ ఇవ్వకపోతే ఎంపీ రఘునందన్ రావు నోరు ఎందుకు మెదపటం లేదని ప్రశ్నించారు.

ఎంఎంటీఎస్ ట్రైన్ తెస్తామని పేదవాళ్ల ఇండ్లు తీసుకొని వాళ్లను రోడ్డున పడేశారని ఆరోపించారు .కానీ ఇప్పటి వరకు ట్రైన్ రాలేదు. వారికి పరిహారం అందలేదని గుర్తు చేశారు .పటాన్ చెరు ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఆందోల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి వచ్చిందని సంతోషిద్దా మంటే వాళ్ల బావమరిది 2 వంద ఎకరాలు కబ్జా చేసిందని కవిత ఆరోపించారు.కానీ వీటిని ఏ పార్టీల వాళ్ల అడగకుండా మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.వాళ్లంతా కూడా రాజకీయంగా ఎదిగి, ప్రజలకు మాత్రం ఏమీ చేయటం లేదన్నారు.సంగారెడ్డిలో మ్యాచ్ ఫిక్సింగ్ లేని, రాజకీయాల అవసరం ఉందిని గుర్తు చేశారు.మేము పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలను ప్రాధాన్యంగా పెట్టుకున్నామ న్నారు.

ఉచిత విద్య, వైద్యం ప్రజలందరికీ ఇస్తామని. రైతును గౌరవించే జవాబుదారీ ప్రభుత్వాన్ని నడిపిస్తామన్నారు. తెలంగాణ యువత మొదటి ఏడాదిలోనే 4 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.యువత వ్యాపారం చేసుకునేందుకు 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని టిఆర్‌ఎస్ చీఫ్ కల్వకుంట కవిత అన్నారు. అంతకుముందు సంగారెడ్డి చౌరస్తా నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ, బతుకమ్మలు, బోనాలతో సంప్ర దాయ బద్ధంగా మహిళలు స్వాగతం పలికారు.

సీతారామస్వామి తిరుకళ్యాణోత్సవంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ ఇంచార్జి ఆదర్శ్‌రెడ్డి

తిరుకళ్యాణోత్సవంలో పాల్గొన్న ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 7, ప్రభాతవార్త: రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్‌లో నిర్వ హించిన ఆదివానం నిర్వహించిన భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవంలో పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండేలా దీవించాలని స్వామి వారిని వేడుకున్నట్లు ఆదర్శ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పోరేటర్ తొంట అంజయ్య కురుమ, మాజీ వార్డు సభ్యులు రాజేష్, బిఆర్‌ఎస్ నాయకులు కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, చిన్న, అప్పల భాస్కర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల హక్కుల కోసమే టిఆర్‌ఎస్ నిరంతర పోరాటం

పటాన్‌చెరు, జూన్ 7,ప్రభాతవార్త: పటాన్‌చెరు ప్రజల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన(టీఆర్‌ఎస్) నిరంతరం పోరాటం చేస్తుందని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ వనరులు, భూములు, ప్రజా ఆస్తులను కాపాడటమే తమ లక్ష్యమని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ ప్రాంతంలో తెలంగాణ రక్షణ సేన (టిఆర్‌ఎస్) జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పటాన్‌చెరును వేధిస్తున్న కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఉద్యమం చేపడతామని తెలిపారు. కాలుష్య నియంత్రణ, తాగునీటి సమస్య పరిష్కారం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. పటాన్‌చెరు అభివృద్ధి కంటే కొందరి వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత లభించిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రజా ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అందరిదేనన్నారు. ప్రజల ఆస్తులను కబ్జా చేసే వారిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొంటామని హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల భూముల రక్షణ కోసం ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకే అర్థం కాని పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీఆర్‌ఎస్ ఓట్లతో గెలిచి ఇప్పుడు విమర్శలు చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒకటేనన్న భావన ప్రజల్లో బలపడుతోందని ఆరోపించారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

భక్తులతో పోటెత్తిన తునికి నల్లపోచమ్మ ఆలయం

కౌడిపల్లి, జూన్ 6, ప్రభాతవార్త:

జిల్లాలలోనే రెండవ అతి పెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం నాడు భక్తులతో పోటెత్తింది. ఉదయం నుండియే భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. తునికి శ్రీ నల్ల పోచమ్మ ఆలయ ఇంచార్జి ఈవో రంగరావు, ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారి శివప్ప వేద మంత్రాల నడుమ అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత భక్తులకు దర్శనాలను కల్పించారు. శివ సత్తుల శిగాలు, డప్పు చప్పుల దరువుల నడుమ భక్తులు అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్ట ప్రదక్షణలు చేసిన తర్వాత అమ్మవారి ఎదుట బోనం నైవేద్యాలను

పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గర్భగుడిలో అమ్మ వారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి, అమ్మ ఆశీర్వాచనం పొందారు. కొంత మంది భక్తులు తమ కోరికలు తీర్చిన శ్రీ నల్ల పోచమ్మ తల్లికి ఓడి బియ్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయం సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వేసవి ఎండ తీవ్రత రూపం దాల్చుతున్న సందర్భంలో ఆలయంకు విచ్చేసే భక్తులకు త్రాగునీటి సమస్య రాకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బందితో మౌళిక సదూపాయాలను కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తొచినంత విరాళాలు ఇస్తే భక్తులకు సౌకర్యార్థం కాటేజ్‌లు నిర్మించ బడుతాయని ఇంచార్జి ఈవో రంగ రావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీరితో పాటు గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి శేఖర్, ఉప సర్పంచ్ మధుసూధన్ గౌడ్, ఆలయం జూనియర అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, ఆలయ పూజారి రాజేశ్వర్, విజ్ఞేశ్ అప్ప, గ్రామ పెద్దలు సాయా గౌడు, శంకర్, శేఖర్, చల్ల మల్లేశం, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి హామీఇచ్చిన ఎమ్మెల్యే

పటాన్ చెరు ,జూన్ 7,ప్రభాతవార్త :
పటాన్ చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మాజీ ప్రజా ప్రతినిధులు, బల్దియా అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా వర్షాకాలంలో వర్షపు నీరు బయటకి వెళ్లకపోవడం మూలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్, అతి త్వరలో వర్షపు నీరు తరలించేందుకు ప్రత్యేక డ్రైన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం డిఈ కృష్ణవేణికి ఆదేశించారు. హైమాస్ట్ లైట్లు, బిటి రెన్యువల్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల కోరిక మేరకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల ప్రార్థన మందిరాల నిర్మాణం కోసం వివాదాలు లేకుండా కాలనీలోనే స్థలాలు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కాలనీలో గల ఇండోర్ స్టేడియం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, పృథ్వీరాజ్, శ్రీరాములు, బలవంత్, వెంకటేష్, కాలనీ అధ్యక్షులు అమరేందర్, సెక్రటరీ ఐలయ్య, కోశాధికారి జోషి కుమార్, ఉపాధ్యక్షులు శంకరయ్య, రామచంద్రయ్య, జాయింట్ సెక్రటరీ శ్రీధర్, కాలనీ మాజీ అధ్యక్షులు మాణిక్ రెడ్డి, మనోహర్, రూప్ సింగ్, శ్రీరాములు, సంగమేష్, రాజమల్లయ్య, మొగలిమాల, తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వాసుల సమస్యలపై అడిగి తెలుసుకుంటున్న గూడెం మహిపాల్ రెడ్డి

సిర్గాపూర్‌లో ఎస్‌వి కేర్ ఆసుపత్రి ప్రారంభం

సిర్గాపూర్, జూన్ 7, ప్రభాతవార్త: మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వి కేర్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రికి చేరుకున్న రోగులకు నాణ్యమైన వైద్యం సరసమైన ధరలో అందించాలని ఆసుపత్రి నిర్వాహకులకు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో రాణా ప్రతాప్‌సింగ్, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవరావు, సురేష్ నాయక్, నర్సాగౌడ్, నారాయణ నాయక్, సర్దార్ నాయక్, జబ్బార్, వసీం, హరినాయక్, మోహన్, పుండరీకం, నవీన్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

-విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే...
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులై బాసర ట్రిబుల్ ఐటిలో సీట్లు పొందిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శాలువాలు కప్పి, ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తును బంగారు మయం చేసుకునేందుకు క్రమ శిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సూచించారు.

బాసర్ ట్రిబుల్ ఐటిలో సీట్లు పొందిన విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గీతంలో క్వాంటం సాంకేతికపై పరిశోధన

పటాన్ చెరు,జూన్ 7,ప్రభాత వార్త:
క్వాంటం టెక్నాలజీల కోసం షట్కోణ బోరాన్ నైట్రైడ్‌లో రుణాత్మక ఆవేశం గల ఏక బోరాన్ ఖాళీల నిర్ధారిత సృష్టి, లక్షణాల నిర్ధారణ ప్రాజెక్టును హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం చేపట్టింది. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ (డీఎస్టీ) నిధులతో కూడిన ఈ ప్రాజెక్టులో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు శుక్రవారం వెల్లడించారు. అత్యాధునిక నానోఫ్యాబ్రికేషన్ పద్ధతులను ఉపయోగించి షట్కోణ బోరాన్ నైట్రైడ్‌లో క్వాంటం లోపాలను సృష్టించడానికి, అధ్యయనం చేయడానికి అధునాతన పద్ధతులను అభివృద్ధి చేయడంపై ఈ ప్రాజెక్టు దృష్టి పెడుతుందని వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీస్ రంగానికి దోహదపడేలా, విస్తృతమైన స్పెక్ట్రోస్కోపిక్, మైక్రోస్కోపిక్ లక్షణీకరణ ద్వారా క్వాంటం ఉద్గార ధర్మాలను అన్వేషించడమే ఈ పరిశోధన లక్ష్యమన్నారు. ఐఐటీ బొంబాయి, రోమ్ (ఇటలీ)లో ఉన్న సాపియెంజా విశ్వవిద్యాలయాల సహకారంతో ఈ ప్రాజెక్టును గీతం హైదరాబాదులో నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థికి అధ్యాపకులు, పోస్ట్ డాక్టోరల్ పరిశోధకులు, డాక్టోరల్ స్కాలర్లతో కూడిన అంతర్జాతీయ పరిశోధన బృందంతో కలిసి పని చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో బీటెక్ లేదా ఎంటెక్ అర్హతలు కలిగి, సెమీ కండక్టర్ పరికరాలు, ఎలక్ట్రానిక్ మెటీరియల్స్‌లో బలమైన పునాది ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. గేట్ అర్హత, మునుపటి ప్రయోగాత్మక పరిశోధన అనుభవం, శ్రీలీడీ, శీనిలీ, తినీలీ, ఫోటోల్యూమినిసెన్స్ (శిలి), రామన్ స్పెక్ట్రోస్కోపీ వంటి అధునాతన క్యారెక్టరైజేషన్ టెక్నిక్‌లపై పరిచయం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మూడేళ్ల కాల పరిమితి ఈ జేఆర్ఎఫ్ కు అర్హతను బట్టి ఫెలోషిప్ అందించబడుతుందని, తొలి రెండేళ్ల నెలకు 37 వేల రూపాయలతో పాటు ఇంటి అద్దె, మూడో ఏడాది సీనియర్ రీసెర్చ్ ఫెలోగా నెలకు 42 వేల రూపాయలు, హెచ్ఆర్ఏ చెల్లిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు ప్రధాన పరిశోధకుడి (పీఐ)గా డాక్టర్ శాంతను సాహా నాయకత్వం వహిస్తారని, ఈ ప్రాజెక్టు కోసం 45.43 లక్షల రూపాయల గ్రాంటు డీఎస్టీ మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యా నేపథ్యం, పరిశోధన అనుభవాన్ని వివరిస్తూ, తాజా బయోడేటాకు ఒక సంక్షిప్త లేఖను జతచేసి పంపాలన్నారు. ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని, ఇంటర్వ్యూలు ఈనెల చివరిలో, లేదా జూలై ప్రారంభంలో నిర్వహిస్తామని తెలిపారు. తక్షణమే విధులలో చేరగల అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థి పనితీరు, ప్రాజెక్టు అవసరాలు, పరస్పర అంగీకారం ఆధారంగా, ఈ పదవిలో పీహెచ్.డీ చేసే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు గొంతు విప్పాలి

సామాజిక కార్యకర్త నెమలికొండ వేణుమాధవ్

సదాశివపేట, జూన్ 7, (ప్రభాతవార్త):
ముంబై-హైదరాబాద్ హైస్పీడ్ రైల్ (బుల్లెట్ ట్రైన్) ప్రాజెక్టులో జహీరాబాద్ హైస్పీడ్ రైల్ స్టేషన్ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన టీఆర్ఎస్ అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవితకు సామాజిక కార్యకర్త నెమలికొండ వేణుమాధవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈ అంశంపై జిల్లా ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు స్పందించి జహీరాబాద్ హైస్పీడ్ రైల్ స్టేషన్ కోసం సమిష్టిగా కృషి చేయాలని కోరారు.

ఆదివారం సంగారెడ్డిలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, జహీరాబాద్ తెలంగాణకు పశ్చిమ ద్వారంగా, పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు పొందిందన్నారు. పాత డిపిఆర్‌లో ప్రతిపాదించిన హైస్పీడ్ రైల్ స్టేషన్ కొనసాగితే సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ నియోజకవర్గం మరియు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావు, సురేష్ శెట్కార్, ఇతర జిల్లా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు మరియు అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఈ అంశంపై తమ గొంతు వినిపించాలని విజ్ఞప్తి చేశారు. పదవుల కోసం పెదవులు ముయవద్దని, ప్రజల ప్రయోజనాల కోసం ముందుకు రావాలని సూచించారు.ప్రాంతీయ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల పెంపు, భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జహీరాబాద్ హైస్పీడ్ రైల్ స్టేషన్ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.

జిల్లా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేసి జహీరాబాద్‌కు హైస్పీడ్ రైల్ స్టేషన్ సాధనకు కృషి చేయాలని వేణుమాధవ్ పిలుపునిచ్చారు.

అయ్యప్ప దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

-దేవాలయ కమిటీ అధ్యక్షునిగా బొగ్గుల సురేష్ విజయం

గజ్వేల్, జూన్ 7 (ప్రభాతవార్త):
హరిహరపుత్ర అయ్యప్ప దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని అధ్యక్షునిగా నూతనంగా ఎన్నికైన బొగ్గుల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఎర్రం శ్రీనివాస్, బొగ్గుల సురేష్‌లు బరిలో నిలువగా ఎర్రం శ్రీనివాస్‌పై బొగ్గుల సురేష్ 32 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా అయిత సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా తూం గోపిలు గెలుపొందగా, ఉపాధ్యక్షునిగా జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, కోశాధికారిగా అలివేణి నారాయణరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా గెలుపొందిన అధ్యక్షుడు బొగ్గుల సురేష్ మాట్లాడుతూ దేవాలయ కమిటీ సభ్యుల సహకారంతో అధ్యక్షునిగా గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా పేరొందిన హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్షునిగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఆలయాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని హామీ ఇచ్చారు. నా విజయానికి సహకరించిన కమిటీ సభ్యులు అందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కాగా గత 30 సంవత్సరాలుగా అయ్యప్ప దేవాలయంలో అధ్యక్షులుగా ఉంటూ సేవలు అందించిన ఎర్రం శ్రీనివాస్ ఈ ఎన్నికల్లో ఓటమి చెందారు. అనంతరం గెలిచిన నూతన కార్యవర్గానికి ఎన్నికల నిర్వాహకులు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్లు గాడిపల్లి భాస్కర్, ఎన్‌సి.రాజమౌళి, లింగోజి కిషన్, ఉప్పల మెట్టయ్య, దుర్గాప్రసాద్, గంగిశెట్టి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రీయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తా

పటాన్ చెరు, జూన్ 7,ప్రభాతవార్త :
పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని వీరభద్రీయుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ అన్నారు. ఇస్నాపూర్ వీరభద్రీయుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముత్తంగి డివిజన్ పరిధిలో గల భవన నిర్మాణ స్థలంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అన్ని వర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా పనిచేస్తు న్నామని తెలిపారు. ఇస్నాపూర్ వీరభద్రీయుల సంక్షేమం కోసం ఇప్పటికే సొంత నిధులతో 200 గజాల స్థలం అందించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ అండగా ఉంటానని భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, ప్రభాకర్, మేరాజ్ ఖాన్, సందీప్, రామకృష్ణ, సంఘం అధ్యక్షులు గట్టు శ్రీనివాస్, పటాన్ చెరు అధ్యక్షులు చవ్వ కొండల్,

త్రాగునీరు బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆధ్యాత్మికంలో శ్రేష్ఠమైన మార్గం కర్మయోగం

జిన్నారం ,జూన్ 7, ప్రభాతవార్త :
త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం లోని వావిలాల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచార కార్యక్రమాన్ని ఇంటింటికి ఆదివారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకం అని, మతాలు నిషిద్ధం అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి వారు తెలిపారు.త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం ను తెలియజేస్తుంది., ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నాము అని , మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలు గా విభజింపబడి ఉన్నాడని జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు, భగవద్గీత లో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయి అని తెలిపారు. సంసార జీవితంలో ఉన్న గృహస్తులకు శ్రేష్ఠమార్గంగా కర్మ యోగం కలదని అన్నారు..ఈ కార్యక్రమం లో త్రైతసిద్ధాంతంప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు సి.హెచ్. గిరి , ఎన్ ఎస్ కుమార్ , నరసింహా చారి, నరసింహా రావు, శ్రీనివాస్, ప్రదం , ఆశు, అంజి, వీరన్న, చంద్రకళ, నాగమణి, లక్ష్మీ ృ, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు

సగరుల్లో సంఘటిత శక్తి పెరగాలి.. అన్ని రంగాల్లో ముందుండాలి...

సగర యువజన సంఘం ఆధ్వర్యంలో..
విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీలో..
సగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర...

రామాయంపేట, జూన్ 7, ప్రభాతవార్త : సగర సమాజంలో చైతన్యం, సంఘటిత శక్తి పెరిగినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలమని సగర సంఘ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర అన్నారు. రామాయంపేట పట్టణంలోని చిత్తారమ్మ దేవాలయంలో ఆదివారం సగర యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ విద్య, ఉపాధి, సామాజిక, రాజకీయ రంగాల్లో సగరులు ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర నాయకత్వంలో సగరులకు గుర్తింపు లభిస్తుందన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం సగర యువత ఉన్నత విద్యలో రాణిస్తూ వివిధ రంగాల్లో గుర్తింపు పొందుతున్నారని పేర్కొన్నారు. సమాజంలో గౌరవంగా, తలెత్తుకుని తిరిగేలా ప్రతి ఒక్కరి పనితనం ఉండాలని సూచించారు. సంఘ సభ్యులంతా ఐక్యంగా ఉంటేనే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు.

సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. సగర సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తు సగర మాట్లాడుతూ సగర యువజనులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు.

సంఘంలోని పేద, అవసరమైన వర్గాలకు ఉపయోగపడేలా చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యువత సేవా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలన్నారు.స్థానికసగర సంఘం అధ్యక్షుడు మర్కు అజేష్ సగర మాట్లాడుతూ సంఘ బలోపేతానికి ప్రతి సభ్యుడిలో చైతన్యం పెరగాలని అన్నారు.

నెలనెలా జరిగే సమావేశాలకు హాజరవుతూ సంఘ అభివృద్ధి, సామాజిక అంశాలపై చర్చల్లో పాల్గొనాలని సూచించారు. దీంతో వివిధ అంశాలపై అవగాహన పెరిగి సమాజ పురోగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

పెద్దల స్ఫూర్తితో సేవలు విస్తరిస్తాం..సగర యువజన సంఘం అధ్యక్షుడు మర్కు రాజు సగర..
సంఘ పెద్దల ఆశీర్వాదం, మార్గదర్శకత్వంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యువతను సంఘటితం చేస్తూ విద్య, సేవ, సామాజిక చైతన్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. సగర సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో సగర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామారపు యాదగిరి సగర, సంఘం ప్రతినిధులు మాసాయిపేట పోచయ్య సగర, రెవెల్లి వినయ్ సగర, మర్కు సత్యం సగర, మాసాయిపేట చంద్రం సగర, మెక్కొండ యేసుపాల్ సగర, సగర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మర్కు శ్రీకాంత్ సగర, ప్రధాన కార్యదర్శి రామారపు శ్యామ్‌రాజ్ సగర, కోశాధికారి దోమకొండ శ్రీనివాస్ సగర, డైరెక్టర్లు మెక్కొండ వంశీ సగర, రామారపు అజేష్ సగర, సోషల్ మీడియా ఇంచార్జ్ మెక్కొండ నాని సగరతో పాటు సంఘం సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రామాయంపేటలో విద్యార్థులకు బుక్స్, బ్యాగులు పంపిణీ చేస్తున్న సగర సంఘం నాయకులు

పంచాయతీ కార్యదర్శి మహేందర్‌కు ఘన వీడ్కోలు

కాంగ్రెస్ నాయకుల సన్మానం

రామాయంపేట, జూన్ 7, ప్రభాతవార్త :బదిలీపై వెళ్తున్న రామాయంపేట మండలం ధర్మారం పంచాయతీ కార్యదర్శి ఎం. మహేందర్‌కు శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు.

ధర్మారం గ్రామంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు మాజీ ఎంపీటీసీ ముస్కుల సిద్దిరాంరెడ్డి హాజరై మాట్లాడుతూ, కార్యదర్శి మహేందర్ తన పదవీకాలంలో గ్రామ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడుత రాజేశం, చాకలి చిన్న నారాయణ, నింగరమైన రమేష్, మొహమ్మద్ అజీపాషా, కట్ట మల్లేశం, బాజా మల్లేశం, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెటేరి నాగరాజు, జిల్లా జనరల్ యూత్ సెక్రటరీ దొమ్మాట రవీందర్, సోషల్ మీడియా మండల నాయకులు ముస్కుల సుధాకర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కమ్మరి కిరణ్ చారీ, ఉడుత ప్రశాంత్, ఎర్పుల వెంకటేష్ తదితరులు పాల్గొని కార్యదర్శి మహేందర్‌ను శాలువాతో సన్మానించారు.

గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యదర్శి సేవలను గుర్తు చేసుకున్నారు. కొత్త కార్యాలయంలో కూడా మహేందర్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి స్తూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నర్సాపూర్ సిఐగా రంగా కృష్ణ బాధ్యతలు స్వీకరణ

సిఐ రంగా కృష్ణ

నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త :
నర్సాపూర్ నకు నూతన సీఐ గా రంగా కృష్ణ బదిలీపై వచ్చి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తూప్రాన్ సిఐగా విధులు నిర్వహించారు. గత నెలలో సిద్దిపేట కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లారు. ఈ క్రమంలో ఐజి చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వుల ఆదేశాల మేరకు నర్సాపూర్ సిఐగా రంగా కృష్ణ నియమితులయ్యారు. ఇప్పటివరకు నర్సాపూర్ సిఐగా పనిచేసిన జాన్ రెడ్డి సిద్దిపేట కమిషనరేట్ కు బదిలీ అయ్యారు. నర్సాపూర్ నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సిఐ రంగా కృష్ణకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు .

జల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

నర్సాపూర్, జూన్ 7, ప్రభాతవార్త :
నర్సాపూర్ మండల పరిధిలోని పెద్ద చింతకుంట శివారులో నర్సాపూర్ మెదక్ ప్రధాన రహదారిపై గల జల హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కాటం బిక్షపతి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి వేదమంత్రాల మధ్యన శ్రీ జలాంజనేయ స్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం, సింధూర లేపనం వంటి ప్రత్యేక పూజలు ఆలయ కమిటీ చైర్మన్ కాటం బిక్షపతి గౌడ్ చే జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలోని భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం పటించారు. ఈ మెదక్ శ్రీ జల హనుమాన్ ఆలయంలో శ్రీ జలాంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కాటం బిక్షపతి గౌడ్ తో పాటు గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెల్దుర్తి , జూన్ 7, ప్రభాతవార్త :
మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఆదివారం నాడు 2008 2009 పదవ తరగతి కి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి విద్యార్థిని విద్యార్థులు ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాచుకు చెందిన మోహన్. ప్రసాద్. గంగా బాయ్. చంద్రం. పిటి కిషోర్లను విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని స్నేహానికంటే మిన్న ఈ లోకాన ఏమీ లేదు అంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి కుమార్ గౌడ్. చందు. మేకల రాజు. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఈవో సుధాకర్‌రెడ్డి

కొమురవెల్లి, జూన్ 7, ప్రభాతవార్త :
కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయ ఈవోగా కట్ట సుధాకర్‌రెడ్డి ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన కార్యనిర్వాహణాధికారి కృష్ణప్రసాద్ వరంగల్(ఉప కమిషనర్‌గా) డిసిగా బదిలీ అయ్యారు. సుధాకర్‌రెడ్డి (ఎఫ్‌ఎసి) పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన అనం తరం ఆయన మాట్లాడారు. కొమురవెల్లి దేవాలయంలో స్వామివారికి సేవచేసే అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడంతోపాటు ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు చంద్రశేఖర్,ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఎలక్ట్రికల్ ఏఈ భాస్కరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మధుకర్,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఉన్న ఆసక్తిని సృజనాత్మక శక్తులను వెలిగిద్దాం

సిద్దిపేట అర్బన్, జూన్ 7, ప్రభాతవార్త :
సంకల్పించిన లక్ష్యాలను సాధించకుంటే ఆది ఓటమి కాదని ఒక పాఠమని తద్వారా విజయానికి మార్గం ఏర్పాటు చేసుకునే అవకాశం అని ప్రముఖ మనోవిజ్ఞాన శాస్త్రవేత్త, విద్యా కౌన్సిలర్,కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ సి.వీరేందర్ అన్నారు. సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వైశ్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలోనే ఉజ్వల భవిష్యత్తుకు చక్కటి మార్గం చూపవలసిన బాధ్యతను తల్లిదండ్రులు స్వీకరించాలని సూచించారు. మనుషులందరిలో సమానమైన శక్తి యుక్తులు ఉంటాయని వాటిని ఎవరు ఎంత అద్భుతంగా సద్వినియోగం చేసుకుంటే వారికి అంత మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పిల్లల్లో ఉన్న ఆసక్తిని సృజనాత్మక శక్తులను వెలిగించాల్సిన బాధ్యతను తల్లిదండ్రులు, సమాజం తీసుకోవాలన్నారు. మానవ వికాసానికి హద్దులు లేవన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమా ధానం చెప్పారు. వాసవి ఫౌండేషన్ ఫర్ ఎంపవర్మెంట్ చైర్మన్ కొమురవెల్లి శివకుమార్, శ్రీశైలం మల్లికార్జున అన్నదాన సత్రం చైర్మన్ మిడిదొడ్డి శ్యాంసుందర్, రిటైర్డ్ ప్రొ॥ లక్ష్మీనారాయణ, వైష్ణవి టెక్నాలజీ సిఇఒ శ్రీకాంత్, అర్యవైశ్య సంఘం అధ్యక్షులు నేతి కైలాసం తదితరులు మాట్లాడారు. కార్య క్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కొర్తివాడ లక్ష్మణ్, కె.అంజయ్య, తోట అశోక్, చంద్రశేఖర్, కూర శ్రీనివాస్, చందా సురేష్, సంతోష్, అంబటిపల్లి భాస్కర్, రాములు, రవీందర్, రాజేశం, కిషన్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రధానం చేశారు.

ఆరోగ్యమే అసలైన సంపద

బెజ్జంకి, జూన్ 7, ప్రభాతవార్త :
గ్రామీణ ప్రాంతా ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని సర్పంచ్ ఎర్రల జానికి రాజు అన్నారు. మండల పరిధిలోని గాగిల్లాపూర్ ఆదివారం సర్పంచ్ ప్రత్యేక చొరతో సుప్రీమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబి రాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఆరోగ్యమే అసలైన సంపద అన్నారు.గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు చికిత్సలు అందించిన కరీంనగర్ సుప్రీమ్ ఆసుపత్రి వైద్య బృం దానికి కృతజ్ఞతలు తెలిపారు.వైద్య శిబిరానికి వృద్దులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించు కున్నారు.సుప్రీమ్ ఆసుపత్రి డాక్టర్ తిరుపతి సిరివేణి ఆధ్వర్యంలో వైద్య బృందం రక్తపోటు,షుగర్, పరీక్ష, హిమోగ్లోబిన్, సిబిసి, ఇసిజి వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతలపల్లి పద్మ, వార్డు సభ్యులు రమేష్,పవన్,లతకొండల్‌రెడ్డి, బాలయ్య, శారద శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీనివాస్,శంకర్,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పేదలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యం

-డాక్టర్ చైతన్య ఆనంద్

వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గజ్వేల్ టౌన్, జూన్ 7 (ప్రభాతవార్త):
పేదలకు వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చైతన్య ఆనంద్ తెలిపారు. ఆదివారం గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో గజ్వేల్ లైఫ్ క్యూర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య ఆనంద్ మాట్లాడుతూ లైఫ్ క్యూర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఒక గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని, అలాగే అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది రోగులు వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోసాని రమేష్, డాక్టర్ అఫ్రోజ్‌హుస్సేన్, డాక్టర్ శివకుమార్, సిబ్బంది ప్రవీణ్‌కుమార్, అనూష, ప్రవీణ్, దినేష్, గోపాల్, పల్లవి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.